## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** అజామబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఫీవర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... బర్కత్‌పుర బస్‌డిపో ఫీడర్ పరిధిలోని నరసింహస్వామి టెంపుల్, రత్నానగర్, అరవింద్ డీగ్రీ కాలేజీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు.... కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధిలోని రత్నానగర్, కాచిగూడ రైల్వేస్టేషన్, బీజేపీ ఆఫీసు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## తెలంగాణ టెన్‌పిన్ బౌలింగ్ విజేత జ్ఞానేశ్వర్


టోర్నమెంట్ విజేత జ్ఞానేశ్వర్, రన్నరప్ నవీన్

**కాచిగూడ:** గేమ్ ఎక్స్‌ట్రీమ్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ ర్యాకింగ్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన జి.జ్ఞానేశ్వర్ మొదటి స్థానం సాధించి విజేతగా నిలవగా నవీన్ రెండోస్థానం నిలిచినట్లు తెలంగాణ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో జ్ఞానేశ్వర్ 19 పిన్‌ల తేడాతో (357–338) నవీన్‌ను ఓడించి తన తొలి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

## వీధి దీపాలకు మరమ్మతులు


నందనవనం కాలనీలో వీధి దీపాల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

**అంబర్‌పేట:** డివిజన్‌లో వీధి దీపాల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లో పలు ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన వీధి దీపాలను కార్పొరేటర్ మరమ్మతులు చేయించారు. నందనవనం, బతుకమ్మకుంట తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో సైతం మరమ్మతులకు గురైన వీధి దీపాలను తక్షణమే మరమ్మతులు చేయిస్తానన్నారు.

## స్కూల్ బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

**అంబర్‌పేట:** ప్రధాని నరేంద్రమోదీ పాలనకు 11 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం బీజేపీ నేతలు విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్ అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌గౌడ్, కన్నె రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్ గౌడ్, నాగభూషణంచారి, యశ్వంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (60) బుద్వేల్ – ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**కాచిగూడ:** రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గౌలిపుర ప్రాంతానికి చెందిన రాజేందర్ కుమారుడు అనిల్ కుమార్ (38) సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంబర్‌పేట ట్రాఫిక్ పీఎస్ కనుమరుగు

### కాచిగూడ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో విలీనం

- లా అండ్ ఆర్డర్ డివిజన్‌కు ఒక ట్రాఫిక్ పీఎస్ నిబంధనలో భాగంగా మార్పు
- అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు
- సిబ్బంది, ఇతర అంశాలను మార్పు పనిలో అధికారులు, సిబ్బంది



కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌గా మారిన అంబర్‌పేట ట్రాఫిక్ పీఎస్

**అంబర్‌పేట:** కాచిగూడ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను తిరిగి విస్తరించారు. గతంలో కాచిగూడ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిని తగ్గించి కొత్తగా అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ స్థానికులకు ట్రాఫిక్ సేవలు అందించింది. తాజాగా కొత్తగా ఏర్పాటు చేసిన అంబర్‌పేట పోలీసుస్టేషన్‌ను తిరిగి కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విలీనం చేశారు. రెండు రోజుల క్రితం అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ విధుల నుంచి రిలీవ్ అయి నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ తిరిగి (విలీనమైన అంబర్‌పేట పీఎస్ కాచిగూడ ట్రాఫిక్ పీఎస్) ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. దీంతో అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ కనుమరుగు అయ్యింది.

### డివిజన్‌కు ఒకటి నిబంధనలో భాగంగా..

నగరంలో లా అండ్ ఆర్డర్ ఏసీపీ డివిజన్ స్థాయిలో ఒక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఉండాలని ఇటీవల నగర పోలీసు కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా కాచిగూడ లా అండ్ ఆర్డర్ ఏసీపీ పరిధిలోకి కాచిగూడ, అంబర్‌పేట లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లు వస్తాయి. ఈ పరిధిలో ఒక కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్వహణను పరిమితం చేసి అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను తొలగించారు. అదే విధంగా నగరంలో మరో మూడు ట్రాఫిక్ పోలీసు స్టేషన్లను కుదించి ఒక కొత్త ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.

### కాచిగూడ పీఎస్ భవనం అంబర్‌పేటలో..

కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌గా తిరిగి పాత పోలీసు స్టేషన్‌గా మారడంతో ఇప్పటి వరకు ఉన్న అంబర్‌పేటలో ఉన్న అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు భవనాన్ని వినియోగించనున్నారు. గతంలో నింబోలి అడ్డలో ఉన్న కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో అంబర్‌పేట సీపీఎల్ కొత్తగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను నిర్మించారు. ఇక్కడి భవనం నిర్మాణం పూర్తి అయ్యేసరిగా కొత్తగా అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పడడంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు భవనం లేకుండా పోయింది. తాత్కాలికంగా నారాయణగూడ ఐపీఎం కేంద్రంలో నిర్వహించారు. తాజాగా అంబర్‌పేట పోలీసు స్టేషన్‌ను తొలగించడంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు కొత్త పక్కా భవనం సమకురినట్లు అయ్యింది.

### ఇక కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకే..

అంబర్‌పేట, కాచిగూడ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధుల్లోకి వచ్చే ప్రాంతాల్నీ ఇకపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తాయి. కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు మెరుగైన సేవలందిస్తాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి. – ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

## రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**కాచిగూడ:** తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 14 బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏవేవో సాకులతో ఎలా తప్పించుకోవాలని చూస్తుందే తప్ప బీసీ రిజర్వేషన్ల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో తీసిన తర్వాతే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వానికి ఎలాంటి అవరోధాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, మోదీ రాందేవ్, అంజి, సి.రాజేందర్, గోరిగె మల్లేష్ యాదవ్, నిమ్మల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా ఫెన్షన్లు మంజూరు చేయాలి


హిమాయత్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఆసరా ఫెన్షన్‌లు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫెన్షన్ మంజూరు చేయాలని సోమవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణికి సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ వినతి పత్రం అందజేసింది. ఐదేళ్ల నుంచి ఆసరా ఫెన్షన్స్ కోసం వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫెన్షన్స్ మంజూరు కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫెన్షన్స్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్, కె.రమేష్, ఆర్.వెంకటమ్మ, మల్లయ్య, రమణమ్మ, నారాయణమ్మ, శ్రీనివాస్, వెంటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


లింగంపల్లిలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

**కాచిగూడ:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ఉమారాణి తెలిపారు. సోమవారం కాచిగూడ, లింగంపల్లిలో జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి బర్కత్‌పుర ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ యాదవ్, బీజేపీ నేతలు శిర్‌సాగర్, ఎం.నర్సింగ్‌రావు, వాసు, భీమ్‌రావు, ఎస్ఎస్ రాము, సూరి, లావణ్య, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌లో ఉద్యమకారులకు గుర్తింపు ఉంటుంది'


డా.రామారావుగౌడ్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నేత జ్ఞానేశ్వర్

**కాచిగూడ:** కాంగ్రెస్ పార్టీలో బడుగు, బలహీన వర్గాలకు, తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఉంటుందని టీపీసీసీ ప్రధా నకార్యదర్శి, ఓయూ జేఏసీ తెలంగాణ నేత డాక్టర్ రామారావుగౌడ్ అన్నారు. పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ–3194) ఆధ్వర్యంలో సోమవారం సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్టర్ రామారావుగౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతులు వెంటనే ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్, మొగరాల శ్రీనివాస్, వేణుగోపాల్‌గౌడ్, అనిల్‌కుమార్, భాస్కర్, శ్రీనివాస్, నిరంజన్, భూషణ్ కృష్ణ, నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా వీహెచ్ జన్మదిన వేడుకలు

**అంబర్‌పేట:** కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డీడీకాలనీలోని ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే దానం నాగేందర్, పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు వీహెచ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా వీరేశ్



**ముషీరాబాద్:** భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా వీరేశ్‌గుప్తా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని డివిజన్ అధ్యక్షులు రాజశేఖర్ ప్రకటించారు. సోమవారం విడుదల చేసిన విలేకరుల సమావేశంలో వీరేశ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్ రాం, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, రాష్ట్ర నాయకులు విశ్వం, కనకేష్, డివిజన్ అధ్యక్షులు రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## దేశ ప్రగతిలో ఉపాధ్యాయులు, అధికారుల పాత్ర కీలకం



ఐఏఎస్ అకాడమీ నూతన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్

**చిక్కడపల్లి:** దేశ ప్రగతిలో ఉపాధ్యాయులు, అధికారవర్గం ప్రధానపాత్ర పోషిస్తారని బ్యాడ్మింటన్ జాతీయ చీఫ్ కోచ్, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ఆర్టీసీక్రాస్‌రోడ్డులో ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ నూతన కేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రాతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ... క్రీడలు లేదా పౌరసేవలు ఏ రంగంలో అయినా విజయం అనేది స్పష్టత, క్రమశిక్షణ మార్గదర్శకత్వం నుంచి వస్తుందన్నారు. ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఈ విలువలను ప్రతిబింబించే వేదికను నిర్మిస్తోందని ప్రశంసించారు. 2030 నాటికి 100 మంది సివిల్స్ అధికారులను దేశానికి అందించే దిశలో ముందుకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. అకాడమీ సీఎండీ జి.రామ్‌రెడ్డి, డైరెక్టర్ వివేకానంద మాట్లాడుతూ... ప్రతి సివిల్స్ విద్యార్థి విజయ ప్రయాణంలో తోడుగా ఉండేందుకు ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ కృషి చేస్తుందన్నారు.

## నేడు మహాధర్నా

**కవాడిగూడ:** జీవో నం.2 ప్రకారం రజక, క్షౌ ర వృత్తిదారులకు ప్రభుత్వం 250 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోంది. ఈ పథకానికి సంబంధించిన రెండేళ్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయలేదు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు సంఘం కార్యదర్శి పి.ఆశయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహాధర్నాకు నాయీ బ్రాహ్మణులు, రజక వృత్తిదారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వీరశైవ లింగాయత్ ఆదర్శ దంపతులకు సన్మానం

**ముషీరాబాద్:** వీరశైవ లింగాయత్, జంగమ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో వీరశైవ లింగాయత్ ఆదర్శ దంపతులకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగ శివచారియా మహాస్వామి ఆదర్శ దంపతులను సన్మానించారు. వీర శైవలింగాయత్‌లలో ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవలింగాయత్ నాయకులు వీరేందర్, శ్రీనివాస్, సతీష్, బస్వరాజ్, గౌరీశంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి


నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

**కాచిగూడ:** స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. సోమవారం కాచిగూడ, నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తమ సత్తాచాటుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల రావు, డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్, భూషణ్ భాస్కర్, ప్రదీప్ గౌడ్, సత్యప్రకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి

**చిక్కడపల్లి:** గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని సోమవారం 'జగదానంద కారకా జయ జానకీ ప్రాణ నాయకా..' శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ శైలజ, శ్రీనివాస్, చంద్రతేజ, గోవిందరావు, సంధ్యారాణి, లలితారావు, వాణి, వర్ధని, రామకృష్ణ, రవిమన్యు, సుబ్రహ్మణ్యం, పీఎస్‌కే రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించండి


విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావని

**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సైఫాబాద్ డీఈ నెహ్రూనాయక్‌ను సోమవారం ఆమె కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమస్యలపై డీఈకి వివరించారు. విద్యుత్ తీగలపై వాలిన చెట్ల కొమ్మలు, ఫీడర్ల వద్ద ప్రమాదకరంగా పెరిగిన చెట్లను తొలగించే పనులు నత్తనడక సాగుతున్నాయని చెప్పారు. అరుంధతినగర్ బస్తీలో కేబుల్ ఏర్పాటు చేయాలన్నారు. హైటెన్షన్(హెచ్‌టీ) లైన్ తీగల క్రమబద్ధీకరణ, విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. డీఈని కలిసిన వారిలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఎం.ఉమేష్, శివకుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాత సుఖీభవ అవార్డుల ప్రదానం


అవార్డులను పొందిన వారితో అతిథులు

**చిక్కడపల్లి:** ప్రతి ఆరోగ్యవంతుడు మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత కె.మురళీమోహన్‌రాజు అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ప్రముఖులకు రక్తదాత సుఖీభవ అవార్డులు ప్రదానం చేశారు. మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ.. ప్రాణదానంతో సమానమైంది రక్తదానం అన్నారు. అవార్డులు పొందిన వారిలో చాలా మంది అనేక సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. నటరాజ్, దేవిరెడ్డిసురేష్ రెడ్డి, రామకృష్ణ, రమేష్, బాలమురళీకృష్ణ, రాజు, బాలమురుగన్, కీర్తన పరమేశ్వరన్, దేవపత్ని, రఘు తదితరులకు అవార్డులు బహూకరించి సత్కరించారు. ఆనందయ్య, శ్రీనివాస్‌లు, రియాజ్‌భాషా, శశిధర్, రామచంద్రరావు, ఎస్ఎస్‌యాదవ్, సత్యనారాయణ, రమణయ్య, జ్యోత్స్న, రవి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలే ప్రాణదాతలు



బద్దం మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డా. బీరప్ప, డా. సత్యనారాయణలు

**చిక్కడపల్లి:** రక్తదాతలే ప్రాణదాతలని మైనం పల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో బద్దం మోహన్‌రెడ్డిని ఆస్పత్రి డైరెక్టర్ డా. బీరప్ప నగరి, సూపరింటెండెంట్ డా. సత్యనారాయణలు ప్రశంస పత్రంతో అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన సోమవారం గాంధీనగర్‌లో మాట్లాడారు. సామాజిక బాధ్యతో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. అపోహలు వీడి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ల సహకారంతో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



ఇందిరాపార్కు నిరసన దీక్షలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

**కవాడిగూడ:** రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ప్రభుత్వం నుంచి జీపీఎఫ్, టీఎస్‌ఎల్ఐఐ తదితర బకాయిలను ఇప్పటి వరకు చెల్లించలేదని రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక మంది ఉపాధ్యాయులు మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. సోమవారం ఉపాధ్యాయులు దండు బాల్‌రెడ్డి, జి.హనుమాన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఆర్.లక్ష్మీనరిసింహ తదితరులు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి రిటైరైన దాదాపు పదివేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే తమ భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామన్నారు. తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.